క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలి



మంత్రి పొన్నంతో నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను కాంగ్రెస్ నాయకులు బుచ్చిలింగ్ సంతోష్‌గౌడ్ కోరారు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల త్వరగా పూర్తి చేసేలా చూడాలన్నారు. రాజీవ్ యువ వికాసం ద్వారా దరాఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులకు వెంటనే నిధులు మంజూరు చేయాలని కోరారు. మంత్రికి పలు సమస్యలను వివరించారు. ఆయన వెంట చేపూరి రాజుగౌడ్ ఉన్నారు.

సామాజికవేత్త దేవానంద్‌కు సన్మానం



దేవానంద్‌ను సన్మానిస్తున్న అందెశ్రీ, అశోక్‌తేజ

ముస్తాబాద్: మండలంలోని కొండాపూర్‌కు చెందిన సామాజికవేత్త, పారిశ్రామికవేత్త, కవి దేవానంద్‌నాగెల్లను హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలంగాణ గీత రచయిత అందెశ్రీ, సినీకవి సుద్దాల అశోక్‌తేజ చేతుల మీదుగా సన్మానించారు. దేవానంద్ ముంబయిలో స్థిరపడ్డారు. దేవానంద్ గ్రామాభివృద్ధికి చేస్తున్న అందిస్తున్న ఆర్థిక అండ, పేదల అభ్యున్నతికి చేస్తున్న సేవను గుర్తించి సత్కరించారు.

'భక్తుల మనోభావాలు కాపాడండి'



వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

వేములవాడ: రాజన్న ఆలయంలో అభివృద్ధి పనుల పేరిట హిందూ దేవీ, దేవతల విగ్రహాలను తొలగించి భక్తుల మనోభావాలను దెబ్బతీసే చర్యలు చేపట్టవద్దని పేర్కొంటూ హిందూ జేఏసీ ప్రతినిధులు దేవాదాయశాఖ కమిషనర్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఆలయంలో జరుగుతున్న కాంట్రాక్టు పనులు హిందువులకే అప్పగించాలని, అన్యమతస్తులకు చెందిన నిర్మాణాలను తొలగించి వేరే ప్రదేశంలో ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఆలయ పౌరాణికత, హిందూ సంప్రదాయాలు కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. హిందూ జేఏసీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, మదన్‌గుప్తా, గడప కిశోర్‌రావు, నామాల శేఖర్, పల్లెల శేఖర్, జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



బహుమతులు అందిస్తున్న గ్రామస్తుడు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని కిషన్‌దాస్‌పేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులను వివిధ అంశాల్లో ప్రోత్సహించేందుకు స్థానికులు గంప లక్ష్మీనారాయణ పలు బహుమతులు అందించారు. రోజువారీగా నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ చూపే విద్యార్థులకు అందించే బహుమతులను సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.సంపత్‌కుమార్, ఉపాధ్యాయుడు ప్రశాంత్‌కుమార్‌లకు అందజేశారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



విరాళం అందిస్తున్న సంఘం సభ్యులు

గంభీరావుపేట: మండలకేంద్రంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ పునరుద్ధరణ పనులు చురుకుగా సాగుతున్నాయి. ఈక్రమంలో ఆలయాభివృద్ధికి స్థానిక శ్రీకృష్ణ యాదవ సంఘం సభ్యులు రూ.30వేలు విరాళంగా అందించారు. సంఘం నాయకులు గుడికాడి మహేశ్, కోట ఎల్లయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సర్కార్ బడుల్లో మెరుగైన విద్య

బోయినపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలతో కూడిన మెరుగైన విద్య అందుతుందని తహసీల్దార్ కాలె నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఇటీవల పది ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించిన బోయినపల్లి హైస్కూల్ హెచ్‌ఎం భూమయ్యతో పాటు, ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను చంద్ర ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ చెన్నమాధవుని రామరాజు ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని తహసీల్దార్ కోరారు.



- 'ఈ ఫొటోలోని పిట్ల తులసవ్వది వీర్నపల్లి మండల కేంద్రం. ఈమె ఇల్లు రోడ్డుకు సమీపంలో ఉంది. రోడ్డు వెడల్పు కార్యక్రమంలో భాగంగా ఈమె ఇంటి స్థలం కొంత మేర కోల్పోతుండగా, గత ప్రభుత్వంలో అధికారులు డబుల్‌బెడ్రూం ఇస్తామని హామీ ఇచ్చారు. ఈక్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 15రోజుల్లో రోడ్డు వేస్తానని చెప్పిన కాంట్రాక్టర్ ఆమె ఇంటి మెట్లను కూల్చేశారు. కాగా, ఐదు నెలలు గడిచినా రోడ్డు వేయడం లేదని, మెట్లు లేక తీవ్రఇబ్బందులు పడుతున్నామని, రోడ్డు కోసం తీసిన గుంతలో పడితే బాధ్యులు ఎవరని బాధితురాలు వాపోయింది. పక్క ఇంటి వారి స్థలం నుంచి రాకపోకలు సాగిస్తున్నామని పేర్కొంది. ఇప్పటికైనా అధికారులు రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని కోరింది'.



సీసీ రోడ్డు కోసం కంకర పోసి వదిలేసిన కాంట్రాక్టర్

అర్ధంతరంగా

వదిలేశారు

- ముందుకుసాగని సీసీ రోడ్డు నిర్మాణం
- అసంపూర్తి పనులతో స్థానికుల ఇబ్బందులు
- పరిహారంతో ముడిపడిన వైనం

వీర్నపల్లి: మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ కోసం నాలుగుసార్లు కొలతలు వేశారు. 56 అడుగుల మేర రోడ్డు విస్తరించేందుకు గ్రామసభలో తీర్మానం చేశారు. ఈనేపథ్యంలో ఎల్లారెడ్డిపేట నుంచి కోనరావుపేట మండలం మరిమడ్ల వరకు ఉన్న సింగిల్ రోడ్డును రెండు వరుసలుగా మార్చేందుకు రూ.25 కోట్లు మంజూరయ్యాయి. వంతెనల నిర్మాణం, మండల కేంద్రంలో నాలుగు వరుసల రహదారికి కలిపి మరో రూ.25 కోట్లు మంజూరు కాగా, అధికారులు మార్కింగ్ ఇచ్చారు. తర్వాత రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోతున్న యజమానుల నుంచి వ్యతిరేకత వచ్చింది. దీంతో బాధితులకు పరిహారంగా 80 డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేశారు. తర్వాత అంబేడ్కర్‌నగర్‌తోపాటు మండలకేంద్రంలోని సుభాష్‌నగర్ వరకు 1.3 కిలోమీటర్ మేర రోడ్డు నిర్మాణం జరిగింది. ఈక్రమంలో సాంకేతిక కారణాలు, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సదరు ప్రొసీడింగ్‌లు రద్దయ్యాయి. దీంతో 300 మీ టర్ల పరిధిలో విస్తరణ పనులను రోడ్డుకు ఇరువైపులా ఉన్న యజమానులు అడ్డుకున్నారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తేనే సహకరిస్తామని డిమాండ్ చేస్తున్నారు. అయితే ఆ దిశగా వారికి ఎవరూ హామీ ఇవ్వకపోవడంతో విస్తరణ పనులు మధ్యలోనే ఆగిపోయాయి.



ఎస్సార్ పెట్రోల్ పంపు వద్ద మట్టి పోసి వదిలేసిన కాంట్రాక్టర్

రోడ్డుపైనే మురుగు

రహదారి విస్తరణలో భాగంగా సదరు కాంట్రాక్టర్‌తోపాటు ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రణాళిక లేకుండా పనులు చేపట్టారు. దారి నిర్మాణానికి ముందుగా విద్యుత్ స్తంభాలు, మురికి కాలువలు, తాగునీటి పైపులైన్ వేయాలి. కనీసం ఆయా పనులకు అంచనాలు లేకుండా నిధులు మంజూరు కాక ముందే రోడ్డు పనులు మొదలుపెట్టారు. డ్రైనేజీ నిర్మించక ముందే పాత కాలువలను పూడ్చేయడంతో మురుగునీరు రోడ్డుపైకి చేరి కంపు కొడుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. కాగా ఇదే రోడ్డు మీదుగా అధికారులు రాకపోకలు సాగిస్తున్నా కనీసం స్పందించడం లేదు.

ఇబ్బందులు పడుతున్నాం



మండల కేంద్రంలో రోడ్డు పనులు ప్రారంభించి అర్ధాంతరంగా వదిలేయడంతో చాలా సమస్యలు ఎదుర్కొంటున్నాం. డ్రైనేజీ తొలగించడం వల్ల మురికి నీరు రోడ్డుపై చేరి దుర్వాసన వస్తోంది. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదు.

– తౌటు అజయ్, వీర్నపల్లి

ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి



రోడ్డు వెడల్పులో ఇళ్లు కోల్పోతున్న వారికి గత ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లను ఇస్తామని హామీ ఇచ్చింది. ప్రభుత్వం మారడంతో లబ్ధిదారులు అయోమయంలో ఉన్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా బాధితులకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి ఆదుకోవాలి.

– ఎగ్గిలం సాయికిరణ్, వీర్నపల్లి

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి



ముస్తాబాద్: ముఖర్జీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు



బోయినపల్లిలో..

ముస్తాబాద్/కోనరావుపేట/ఇల్లంతకుంట/వీర్నపల్లి/తంగళ్లపల్లి/బోయినపల్లి/వేములవాడఅర్బన్/ఎల్లారెడ్డిపేట/గంభీరావుపేట: దేశం కోసం ఆత్మబలిదానం చేసుకున్న శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ నేటితరానికి ఆదర్శప్రాయుడని బీజేపీ ముస్తాబాద్ మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతికుమార్ అన్నారు. సోమవారం శ్యామ్‌ప్రసాద్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలువేసి నివాళి అర్పించారు. కోనరావుపేటలో మండలాధ్యక్షుడు మిర్యాల్‌కార్ బాలాజీ, ఇల్లంతకుంటలో మండల అధ్యక్షుడు భూమళ్ల అనిల్‌కుమార్, వీర్నపల్లిలో అధ్యక్షుడు మాలోత్ లక్‌పతినాయక్, తంగళ్లపల్లిలో వెన్నమనేని శ్రీధర్‌రావు, బోయినపల్లిలో కరీంనగర్ అసెంబ్లీ కన్వీనర్ దుబ్బాల శ్రీనివాస్, మండల అధ్యక్షుడు ఎడపల్లి పరశురామ్, వేములవాడలో పట్టణ అధ్యక్షుడు రాపెల్లి శ్రీధర్, అర్బన్ అధ్యక్షుడు బుర్ర శేఖర్‌గౌడ్, ఎల్లారెడ్డిపేటలో అధ్యక్షుడు రేపాక రామచంద్రారెడ్డి, గంభీరావుపేటలో మండల అధ్యక్షుడు కోడె రమేశ్ ఆధ్వర్యంలో శ్యామ్‌ప్రసాద్ చిత్రపటానికి నివాళి అర్పించారు.

వేములవాడ ఏడీఈగా అనిల్‌కుమార్



వేములవాడఅర్బన్: వేములవాడ సబ్ డివిజన్ సెస్ ఏడీఈగా చిలుముల అనిల్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న శ్రీధర్ తంగళ్లపల్లికి బదిలీ కాగా, జగిత్యాల నుంచి అనిల్‌కుమార్ వేములవాడకు బదిలీపై వచ్చారు.

చందుర్తి ఎంపీడీవోగా రాధ



చందుర్తి: చందుర్తి ఎంపీడీవోగా ఎల్.రాధ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఎంపీడీవో రవీందర్ ఫిబ్రవరిలో జగిత్యాల జిల్లా ధర్మపురికి బదిలీ కాగా, అప్పటి నుంచి కోనరావుపేట, రుద్రంగి ఎంపీడీవోలుగా శశికళ, నటరాజన్ ఇన్‌చార్జీలుగా కొనసాగారు. కొద్ది నెలలుగా ఎంపీవో బండి ప్రదీప్‌కుమార్‌కు ఇన్‌చార్జి ఎంపీడీవోగా కొనసాగుతున్నారు. తాజాగా రాధను ఎంపీడీవోగా నియమించారు.

పాలడెయిరీ చైర్మన్‌గా రమేశ్



చైర్మన్‌గా ఎన్నికైన రమేశ్, సభ్యులు

గంభీరావుపేట: గంభీరావుపేట పాల డెయిరీ చైర్మన్‌గా గంట రమేశ్ ఎన్నికయ్యారు. సోమవారం పాడి రైతుల సమావేశంలో ఎన్నుకున్నారు. డైరెక్టర్లుగా రాజేందర్‌రెడ్డి, మహేశ్, శ్రీనివాస్, ముత్యంరావు ఎన్నికయ్యారు.

మాదకద్రవ్యాలకు బానిస కావొద్దు



అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాస్

వేములవాడరూరల్: మాదకద్రవ్యాలకు బానిస కావొద్దని వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ అన్నారు. అక్రమ రవాణా అవగాహన వారోత్సవాల్లో భాగంగా రూరల్ మండలంలోని నూకలమర్రి ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటారు. అనంతరం మాదక ద్రవ్యాలతో జరిగే నష్టం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇచ్చే పదార్థాలు, చాక్లెట్‌లు తీసుకోకూడదని, ఏదైనా సమాచారం తెలిస్తే 1908 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ అంజయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

ఉపాధి హామీ సామాజిక తనిఖీ

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో సోమవారం అధికారులు ఉపాధి హామీ సామాజిక తనిఖీ నిర్వహించారు. గత సంవత్సరం జరిగిన పనులను అధికారులు గ్రామసభ నిర్వహించి ప్రజలకు వివరించారు. ఎస్‌ఆర్‌పీ రమేశ్, జేఈ రాజనర్సయ్య, డీఆర్‌పీ సురేశ్, సెక్రటరీలు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ఇల్లంతకుంట: మండలంలోని రహీంఖాన్ పేట గ్రామంలో సోమవారం ఎస్సై అశోక్ వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనాల ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్సులు పరిశీలించారు.

అధిక ఫీజులపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ముస్తాబాద్: ముస్తాబాద్‌లోని ఓ ప్రైవేటు స్కూల్‌లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని పోతుగల్‌కు చెందిన జంగ రాజు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పాఠశాలలో కనీస వసతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా ఓ దుకాణంలో పుస్తకాలు, నోట్ బుక్కులు విక్రయిస్తున్నారన్నారు. అలాగే ఓ ప్రైవేటు పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులను చేర్చుకున్నారని ఎంఈవోకు ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

గంభీరావుపేట ఆర్‌ఐపై..

గంభీరావుపేట: గంభీరావుపేట ఆర్‌ఐ గోపీపై బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు గంట అశోక్ సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కార్యాలయానికి వచ్చే ప్రజలతో ఆర్‌ఐ దురుసుగా ప్రవర్తిస్తున్నాడని, సర్టిఫికెట్ల జారీ విషయంలో విద్యార్థులను, ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాడని, ఆయన తీరుపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

పాఠశాలకు పెయింటింగ్

వేములవాడరూరల్: వేములవాడ మున్సిపాలిటీ 1వ వార్డు శాత్రాజుపల్లిలో ప్రభుత్వ పాఠశాల తరగతి గదులకు మాజీ కౌన్సిలర్ సంగ హన్మవ్వ, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సంగ స్వామి రూ.50 వేలతో పెయింటింగ్ వేయించారు. ఈ సందర్భంగా వారిని హెచ్‌ఎం జీవనజ్యోతి అభినందించారు.

ఎమ్మార్పీఎస్ జెండా గద్దె నిర్మాణానికి భూమి పూజ

గంభీరావుపేట: మండలంలోని లింగన్నపేట, శ్రీగాధ, దేశాయిపేట గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ జెండా గద్దెల నిర్మాణానికి సోమవారం నాయకులు భూమి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జి పుట్ట రవి, మండల ఇన్‌చార్జి మంగళి చంద్రమౌళి, నాయకులు బరుకుటం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

నాలుగు వరుసల రహదారి నిర్మించాలని వినతి

వేములవాడఅర్బన్: వేములవాడ నందికమాన్ నుంచి ఆరెపల్లి శివారు మిడ్ మానేరు బ్రిడ్జి వరకు నాలుగు వరుసల రహదారి నిర్మించాలని బీజేపీ వేములవాడ మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్‌గౌడ్ సోమవారం కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝాకు వినతిపత్రం అందజేశారు. ఈ దారిలో వాహనల రద్దీ ఎక్కువ కావడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. నాలుగు వరుసల రహదారి పనులు ప్రారంభించాలని కోరారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

రుద్రంగి: మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎస్సై మోతీరాంనాయక్ అన్నారు. ఎస్పీ మహేశ్ బీ గీతే ఆదేశాల మేరకు మాదకద్రవ్యాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం రుద్రంగి పోలీస్ స్టేషన్ భవన నిర్మాణ స్థలంలో సిబ్బంది, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులకు మాదకద్రవ్యాలు(డ్రగ్స్), మద్యం వంటి చెడు వ్యసనాలపై కలిగే నష్టాలను వివరిస్తూ అవగాహన కల్పించారు. బాధ్యత గల పౌరులుగా మాదకద్రవ్యాల నిర్మూలనలో భాగస్వామ్యం కావాలని అన్నారు.



ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామ శివారులోని చిట్టివాగుపై ఉన్న ఇరుకు వంతెనతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇరుకు వంతెనను విస్తరించాలని గతంలో ప్రతిపాదనలు చేసినా ఫలితం లేకుండాపోయింది. ఇరుకు వంతెనపై ఎదురెదురుగా వచ్చే వాహనాలు ఢీకొంటున్నాయి. నెల రోజుల వ్యవధిలో నాలుగు ప్రమాదాలు జరిగి పది మంది వరకు గాయపడ్డారు. ఇప్పటికైనా ఇరుకు వంతెనను విస్తరించాలని వాహనదారులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
కిరణ్, ఆర్‌అండ్‌బీ ఏఈఈ, సెల్ నంబర్: 94408 18864

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

అంగన్‌వాడీల రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలేది..?



మాట్లాడుతున్న రాములు

సిరిసిల్లటౌన్: అంగన్‌వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఎందుకు అమలు చేయడం లేదని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కదారి రాములు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సోమవారం ఏఐటీయూసీ భవన్‌లో మాట్లాడారు. కొద్ది నెలలుగా రిటైర్డ్ టీచర్లు, ఆయాలకు బెనిఫిట్ కింద టీచర్‌కు రూ.2 లక్షలు, ఆయాకు రూ.1 లక్షల అందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల హామీ ప్రకారం రూ.18 వేల వేతనం కూడా నేటికీ అమలు జరగడం లేదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్‌తో 25 రోజుల పాటు నిరసనలు చేస్తే కాంగ్రెస్ పెద్దలు టెంట్‌ల వద్దకు వచ్చి తమ ప్రభుత్వం వస్తే నెరవేరుస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ, కాంగ్రెస్ సర్కారు పాలన చేపట్టి దాదాపు రెండేళ్లు గడుస్తున్నా హామీలు నెరవేర్చడం లేదని విమర్శించారు. తక్షణమే హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, ఉపాధ్యక్షులు పంతం రవి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

సిరిసిల్లఅర్బన్: నిబంధనలను తుంగలో తొక్కి తమ పాఠశాలలోనే పుస్తకాలు, బుక్స్ అమ్ముతూ, అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మ్యాకల పరుశురాం అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద సంఘం నాయకులతో కలిసి నిరసన తెలిపారు. విద్యను వ్యాపారకేంద్రంగా చేసుకొని కొందరు పాఠశాలలోనే పుస్తకాలు, బుక్స్ అమ్ముతున్నారని, అలాంటి స్కూళ్లను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

దుక్కిమందుకు బదులు ఎఫ్–20

- గ్రోమోర్ కేంద్రం ఎదుట రైతుల ఆందోళన



ఎల్లారెడ్డిపేటలోని గ్రోమోర్ కేంద్రం

ఎల్లారెడ్డిపేట: డీఏపీ దుక్కిమందు కావాలని గ్రోమోర్ కేంద్రానికి పోతే దానికి బదులు ఎఫ్–20 అంటగడుతున్నారని ఆరోపిస్తూ మండల కేంద్రంలోని గ్రోమోర్ కేంద్రం ఎదుట రైతులు సోమవారం ఆందోళనకు దిగారు. అవసరం లేని మందులు అంటగడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రానికి చెందిన సాధు నర్సింహారెడ్డి మాట్లాడుతూ డీఏపీ దుక్కిమందు 12 బస్తాలు కావాలని గ్రోమోర్ కేంద్రానికి వెళ్తే.. 8 డీఏపీ బస్తాలకు నాలుగు ఎఫ్–20 బస్తాలను అంటగట్టారన్నారు. గత్యంతరం లేక ఎఫ్–20 బస్తాలను తీసుకున్నట్లు తెలిపారు. పదిరకు చెందిన గుల్లపల్లి లక్ష్మారెడ్డి, మండల కేంద్రానికి చెందిన మద్దుల శ్రీపాల్‌రెడ్డి, అక్కపల్లికి చెందిన పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఆందోళనకు దిగారు. నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

బెస్ట్ అవెలబుల్ స్కూల్‌లో 46 సీట్లు కేటాయింపు

సిరిసిల్లకల్చరల్: ప్రస్తుత విద్యాసంవత్సరంలో జిల్లాలోని బెస్ట్ అవెలబుల్ పాఠశాలలో ఒకటో తరగతిలో 46 సీట్లు కేటాయించారు. 114 దరఖాస్తుల్లో నుంచి 33 శాతం రిజర్వేషన్ ప్రకారం విద్యార్థినులకు 19, బాలురకు 27 సీట్లను సోమవారం కలెక్టరేట్‌లో లాటరీ పద్ధతిలో ఎంపిక చేశారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, జిల్లా ఎస్సీడీవో బి.రాజమనోహర్ రావు ఆధ్వర్యంలో తల్లిదండ్రుల సమక్షంలో లాటరీ తీశారు. డీఈవో వినోద్‌కుమార్, చిన్నబోనాల గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ జాస్మిన్ థెరిస్సా, జిల్లా సంక్షేమాధికారి పి.లక్ష్మీరాజం పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో బోధనేతర సిబ్బందిని నియమించేందుకు జిల్లా విద్యాధికారి వినోద్‌కుమార్ ప్రకటన జారీ చేశారు. బోయినపల్లి, చందుర్తి, ముస్తాబాద్, రుద్రంగి, మర్రిపల్లి, అల్మాస్‌పూర్‌లలోని కేజీబీవీల్లో హెడ్ కుక్, నైట్ వాచ్‌మెన్, అటెండర్, అసిస్టెంట్ కుక్ 3 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. బోయినపల్లి, ఇల్లంతకుంట, కోనరావుపేటలోని టీజీఎంఎస్ బాలికల వసతి గృహాల్లో అసిస్టెంట్ కుక్, వాచ్ ఉమెన్, అసిస్టెంట్ కుక్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సంబంధిత పోస్టులకు ఆయా మండలాలకు చెందిన స్థానిక మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 27లోపు అందిన దరఖాస్తులను పరిశీలనలోకి తీసుకుంటామని పేర్కొన్నారు.

బీడీ కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్స్

ముస్తాబాద్: బీడీ కార్మికుల పిల్లలకు కేంద్ర కార్మికశాఖ ద్వారా అందించే ఉపకార వేతనాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ముస్తాబాద్ వైద్యాధికారి వెంకటేశ్ సోమవారం తెలిపారు. 2025–26 విద్య సంవత్సరానికి ఒకటి నుంచి పదో తరగతి చదివే బీడీ కార్మికుల విద్యార్థులు ఆగస్టు 31లోగా, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, బీటెక్, ప్రొఫెషనల్ కోర్సులు చదివే విద్యార్థులు అక్టోబర్ 31లోగా SCHOLARSHIPS. GOV. IN వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 040–29561297 లో సంప్రదించాలని పేర్కొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

కోనరావుపేట: మండలంలోని కొలనూర్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు, నాయకులు సోమవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. వీరవేణి తిరుపతియాదవ్, కమలాకర్ తదితరులు ఉన్నారు.